ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

ముఖ్యాంశాలు

- 2026-27 ఆర్థిక బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.

- రానున్న ఆర్థిక సంవత్సరానికి మెరుగైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు పేర్కొన్నారు.

- వ్యవసాయం లాభసాటిగా మారితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని మంత్రి కె. అచ్చెన్నాయుడు అన్నారు.

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 131వ సంచిక ఈనెల 22న ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర ప్రభుత్వం 2026--27 ఆర్థిక సంవత్సరానికి వార్షిక బడ్జెట్‌ను ఈరోజు చట్టసభలకు సమర్పించింది. ఈ ఉదయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో 2026-27 ఆర్థిక బడ్జెట్ ను ఆమోదించారు. అనంతరం శాసనసభలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ 3 లక్షల 32 వేల 205 కోట్ల రూపాయలతో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టారు. రెవెన్యూ వ్యయం 2 లక్షల 56 వేల 143 కోట్ల రూపాయలుగా, మూలధన వ్యయం 53 వేల 915 కోట్లు రూపాయలుగా నిర్ణయించారు. కాగా రెవెన్యూ లోటు 22 వేల 002 కోట్లు, ద్రవ్య లోటు 75 వేల 868 కోట్ల రూపాయలుగా పేర్కొన్నారు. విద్యుత్ రంగానికి 13 వేల 934 వేల కోట్లు రూపాయలు, రహదారులు, పోర్టులు, విమానాశ్రయాలకు కలిపి 13 వేల 546 కోట్ల రూపాయలు, పరిశ్రమల కోసం 3 వేల 161 కోట్ల రూపాయలను, డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ మోసాలు వంటి ఆధునిక నేరాలను ఎదుర్కొనేందుకు ప్రతి జిల్లాలో ప్రత్యేక సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని, కొత్త ఏపీ పోలీసు అకాడమీ స్థాపన కోసం 94 ఎకరాలు కేటాయించామని మంత్రి తెలిపారు. విశాఖ ఆర్థిక ప్రాంతానికి 28 వేల కోట్ల రూపాయలు కేటాయించామని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి పలు ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు కేటాయింపులు ప్రకటించింది. వార్షిక బడ్జెట్ లో వ్యవసాయం-నీటి భద్రత కేటాయింపుల ప్రముఖంగా పస్తావించింది. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 9

వేల 906 కోట్లు, అన్నదాత సుఖీభవకు  6 వేల 600 కోట్లు, పోలవరంకు 6 వేల 105 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజనకు ఒక వెయ్యి 927 కోట్లు, ధరల స్థిరీకరణ నిధికి 500 కోట్ల రూపాయలు కేటాయించామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలియజేస్తూ....

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

2026-27 ఆర్థిక సంవత్సరానికి మెరుగైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడు అన్నారు. అసెంబ్లీలో ఈ రోజు ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్‌పై ముఖ్యమంత్రి స్పందిస్తూ... హార్టీకల్చర్ హబ్‌కు 30 వేల కోట్ల రూపాయలు కేటాయించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రాయలసీమ ముఖచిత్రాన్ని తాము మార్చామని, దేశంలోనే నాణ్యమైన పండ్లు ఈ ప్రాంతం నుండే వస్తున్నాయని తెలిపారు. వ్యవసాయం, సేవారంగాల నుంచి ఎక్కువ ఆదాయం రావాల్సి ఉందని, రెండు మూడేళ్లలో అమరావతికి ఒక రూపు వస్తుందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వ్యవసాయం లాభసాటిగా మారితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు అన్నారు. శాసనసభలో ఆయన ఈ రోజు 2026--27 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. దేశ వ్యవసాయ రంగం ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ వాటా 10 శాతమని, వ్యవసాయ రంగం వృద్ధి రేటు 7.83 శాతంగా నమోదు అయ్యిందని వెల్లడించారు. ప్రతి

సంవత్సరం రైతు కుటుంబానికి 20 వేల రూపాయల చొప్పున అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద నిధులు అందిస్తున్నామని తెలిపారు. డీప్ టెక్నాలజీ, కృత్రిమ మేథ, డ్రోన్స్, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతల ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తున్నామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 131వ సంచిక ఈనెల 22వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 20వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రయాణికులు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని దక్షిణ మధ్య రైల్వే ఐజి, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్ స్పష్టం చేశారు. తిరుపతిలోని ఆర్.పి.ఎఫ్. బ్యారక్ ఆవరణలో తిరుపతికి వచ్చే ప్రయాణికుల భద్రతపై సంబంధిత అధికారులతో ఈ రోజు ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ... తిరుపతి

రైల్వేస్టేషన్ లో నూతన సాంకేతికత వినియోగిస్తూ.. ఫేస్ రికవరీ పద్ధతుల ద్వారా దొంగతనాలకు అడ్డుకట్ట వేస్తామని వెల్లడించారు. ప్రతిరోజు తిరుపతికి వచ్చే ప్రయాణికులకు పూర్తి స్థాయి భద్రత కల్పిస్తున్నామని అరోమా సింగ్ ఠాకూర్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పూర్వ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య కృషి, పట్టుదలకు ప్రతీక అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు సంజీవయ్య 105వ జయంతి సందర్భంగా మంత్రి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ... దేశ రాజకీయ చరిత్రలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న సంజీవయ్య.. సామాన్య కుటుంబం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయి వరకు ఎదిగి సామాజిక న్యాయం కోసం పని చేసిన నాయకుడిగా గుర్తింపు పొందారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో సంజీవయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐసీసీ పురుషుల టీ-20 ప్రపంచ కప్‌లో భాగంగా కోల్‌కతాలోని ఈడెన్‌గార్డెన్స్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన స్కాట్‌లాండ్ జట్టు.. ప్రత్యర్థి ఇంగ్లాండ్ కు 153 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లాండ్ 15 ఓవర్లకు 4 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది.

అదే విధంగా గుజరాత్‌లో అహ్మదాబాద్ వేదికగా న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య రాత్రి 7 గంటలకు క్రికెట్ మ్యాచ్ ప్రారంభం కానుంది. అంతకుముందు కొలంబో వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఒమన్ జట్టుపై ఐర్లాండ్ 96 పరుగుల తేడాతో విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వర స్వామి వారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఈరోజు పట్టు వస్త్రాలను అందజేశారు. అలాగే శ్రీకాళహస్తిలో 29 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన “శివం టు శివం” రహదారిని మంత్రి ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రూరల్ ఇంక్యుబేషన్, స్కిల్లింగ్ అండ్ ఆంట్రప్రెన్యూర్‌షిప్ సెంటర్ (రైజ్) కేంద్రంలో ప్రత్యేక కార్య శాలలను మహిళలు సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆకాంక్షించారు. ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి  రైజ్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక జాగృతి కార్యశాలను జిల్లా కలెక్టర్ ఈరోజు సందర్శించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =